క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన షంషేర్ అలీబేగ్



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బొకే ఇస్తున్న షంషేర్ ఆలీబేగ్

మార్కాపురం: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ శనివారం కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వెనుకబడిన మార్కాపురం ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ



స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేస్తున్న ఉత్తమ్‌కుమార్

మార్కాపురం: పట్టణంలోని 11వ బ్లాక్‌లో ఉన్న ఎస్సీ,బీసీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను 11వ బ్లాక్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ చరిత శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు.

మానవతా సంస్థ ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడులో పేద కుటుంబానికి చెందిన చీకటి అంజమ్మ మృతి చెందారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు అంజమ్మ మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ కన్వీనర్ కె.యల్లమందారెడ్డి, అధ్యక్షుడు కల్లం సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి అశోక్, షేక్ బాజీ కరీముల్లా, రాజ్‌కుమార్, మల్లాపురం నరసింహం, రామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల మూసివేత



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో గిరిధరశర్మ

రాచర్ల: మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధిలోని ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో జూన్ 13వ తేదీన ప్రారంభమైంది. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేదీన పాఠశాలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఒక విద్యార్థి కూడా లేకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నత విద్యాశాఖాధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విద్యా సంవత్సరానికి ఓబుల్‌రెడ్డిపల్లె ఎంపీపీ స్కూల్‌ను మూసివేస్తూ అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని మండలంలో అవసరమైన చోటుకు బదిలీ చేస్తున్నట్లు ఎంఈవోలు గిరిధర శర్మ, శివకోటేశ్వరరావు తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం



నాగూర్‌బాషాను సన్మానిస్తున్న తహసీల్దార్

కంభం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ బాషా, అటెండర్ ఎస్.చెన్నకేశవులు ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా శనివారం సాయంత్రం కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామయ్య మాట్లాడుతూ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ వారందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం వారు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యాలయ సిబ్బంది పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అర్ధవీడు ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వలు, రీసర్వే డీటీ నాయబ్ రసూల్ ఉద్యోగ విరమణ పొందిన ఇరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మూడేళ్లలో అభివృద్ధి చేశాం

- కౌన్సిల్ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించాలి
- కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్ మృతికి సంతాపం
- చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ



మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణ

మార్కాపురం టౌన్: పురపాలక సంఘంలో వైఎస్సార్ సీపీ కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు అయిందని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జున రెడ్డి, అన్నా రాంబాబు, ప్రజా ప్రతినిధుల సహకారంతో పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో మున్సిపల్ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు సిద్ధంగా ఉన్నమన్నారు. శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ మూడేళ్లలో పట్టణంలో సుమారుగా 150 బోర్లు, పైపు లైన్లు ఏర్పాటు చేశామన్నారు. జనరల్ ఫండ్ ద్వారా సుమారు 7 నుంచి 8 కోట్లు ఖర్చుపెట్టి వివిధ అభివృద్ధి పనులను చేశామని చెప్పారు. 24 కోట్ల రూపాయలతో మూడు కిలోమీటర్ల మేర దూపాడు వద్ద సాగర్ పైపులైను, పట్టణంలో సాగర్ పైపులైన్, సాగర్ కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకు వరకూ రెండున్నర కిలోమీటర్ల మేర పైపులైన్ల ఏర్పాటు తదితర పనులను నిర్వహిస్తున్నామన్నారు. కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్ అకాల మరణం చాలా బాధాకరమన్నారు.

ముందుగా మృతికి కౌన్సిల్ సభ్యులు సతాపం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకూ చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని లేకుంటే వారు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సాగర్‌నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పట్టణంలోని ప్రజలకు నీటి సమస్యలేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరారు. ప్రజలకు నీటి సమస్య లేకుండా చెరువులో డీప్‌బోర్లు వేసి నీటిని పంప్ హౌస్‌కు సరఫరా చేస్తున్నామని, ప్రస్తుతం నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఈ సుభాని తెలిపారు. పట్టణంలో ఫాగింగ్ చేయాలని, కుక్కలు, కోతులు, పందుల, ఆవుల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూరగాయల మార్కెట్టు ఫీజు వసూళ్లు, అలాగే చేపల మార్కెట్, జంతు వధ శాల ఫీజు వసూళ్లను రద్దు చేసి తిరిగి వేలం పాటలు నిర్వహించాలని కౌన్సిలర్ ఎం. శ్రీనివాసులు సభను కోరగా చైర్మన్‌తో పాటు కౌన్సిల్ ఆమోదంతో రద్దు చేశారు. త్వరలో ప్రజలకు వేలంపాటల గురించి ప్రచారం ద్వారా తెలియజేసి వేలం పాట నిర్వహిస్తామని చైర్మన్ కృష్ణ తెలిపారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

మార్కాపురం: లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం లభిస్తుందని మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం. శుభవాణి అన్నారు. మార్కాపురం కోర్టు సముదాయంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కేసుల్లో ఉన్న వారు రాజీపడేందుకు లోక్ అదాలత్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలని కోరారు. కక్షలు, గొడవలకు పోవద్దని సూచించారు. క్రిమిన్ కేసులు 75, చెక్ బౌన్స్ కేసులు 7, వివాహ సంబంధ కేసులు 5, మోటారు వాహన కేసులు 2, సివిల్ కేసులు 14 రాజీమార్గంలో పరిష్కారమైనట్లు తెలిపారు. మొత్తం 3 బెంచీలు ఏర్పాటు చేశారు. సీనియర్ సివిల్‌జడ్జి బి. దేవేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జె. కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో బెంచ్‌లు ఏర్పాటై కేసులను పరిష్కరించారు. బెంచ్ మెంబర్లుగా బి. కాశయ్య, ఎస్కే బేగం, కరీమున్నిసా వ్యవహరించారు.



క్లయింట్లకు అన్నవితరణ చేస్తున్న జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి శుభవాణి

లోక్ అదాలత్ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్న వితరణ కార్యక్రమాన్ని ఆరో అదనపు న్యాయమూర్తి శుభవాణి ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీలు గాంధీ రెడ్డి, నారాయణ రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు భూపని కాశయ్య, ఉమ్మడి రవీంద్రనాథ్, అనీల్‌కుమార్, గాయం లక్ష్మీకుమార్ రెడ్డి, హరికృష్ణ, కృష్ణశాస్త్రి, శారద, చౌడేశ్వరరావు, మానవతా సంస్థ ప్రతినిధులు గుంటక వనజాక్షి, చెన్నారెడ్డి డేవిడ్ స్టోన్, ఆర్‌కేజే నరసింహం, ఎస్‌వీఎల్, బత్తుల రామిరెడ్డి, పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణం

- పట్టించుకోని ఉపాధ్యాయులు



నిర్మాణంలో ఉన్న భవనం వరండాలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు



ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు గుమిగూడిన విద్యార్థులు

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో శుచి, శుభ్రత పాటించక పోవడంతో విద్యార్థులు అపరిశుభ్రంగా ఉన్న చోటే కూర్చొని భోజనం చేస్తున్నారు. పాఠశాలలో రోజూ 200 మందికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తుంటారు. విద్యార్థులు భోజనానికి కూర్చునే పరిసరాలను కనీసం శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు ఆ మట్టిలోనే కూర్చొని తింటున్నారు. పాఠశాలలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని, విద్యార్థులకు రెండు డ్రమ్ముల్లో బోరు వాటర్ ఉంచారు. కనీసం అక్కడ గ్లాసులు కూడా లేకపోవడంతో ఎక్కువ మంది విద్యార్థులు భోజనం చేసిన ప్లేట్లలోనే నీరు పట్టుకొని తాగుతున్నారు. పాఠశాల ప్రాంగణంలోనే ఉన్న ట్యాంకు వద్ద చేతులు, ప్లేట్లు కడుగుతుండటంతో వ్యర్థాల కూడిని మురుగు నీరంతా తరగతి గదుల ముందే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మండల విద్యాశాఖాధికారి ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఇక్కడ మార్పు రావడం లేదు. మండలంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని తనిఖీలు నిర్వహించి వారికి సూచనలిచ్చే మండల విద్యాశాఖాధికారి తాను పని చేసే పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ముండ్లపాడులో నీటి కోసం ఇబ్బందులు



ట్యాంకు వద్ద బారులు తీరిన బిందెలు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు శివాలయం వీధిలో స్థానిక ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో శివాలయం వెనుక బోరు నుంచి వచ్చే నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుకు ఎక్కించేవారు. ప్రస్తుతం నీటి నిల్వలు తగ్గిపోవడంతో ట్యాంకుకు ఎక్కడం లేదు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. శివాలయం ముందు భాగంలో ఉన్న మరో బోరు నుంచి చిన్న ట్యాంకుకు ద్వారా నీటిని వంతుల వారీగా పట్టుకుంటున్నారు. ట్యాంకు వద్ద నీటిని పొందాలంటే బిందెలు ఒక్క రోజు ముందు పెట్టి వేచి ఉంటేనే నీటిని పొందే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. వెనుకాల ఉన్న బోరు నుంచి వచ్చే అరకొర నీటిని శివాలయం ముందు భాగంలోని ట్యాంకుకు ఎక్కించాలని స్థానికులు కోరుతున్నారు. ట్యాంకర్ల ద్వారా అయినా సరే నీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

పొదిలి: పట్టణంలోని ఓబులశెట్టివారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సీడీపీఓ సుధమారుతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రాల్లో ఆరు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపించే ప్రక్రియలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లల తల్లులను, పాఠశాల టీచర్లను గౌరవించటం, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. సూపర్‌వైజర్‌లు సావిత్రి, ఝాన్సీ, కార్యకర్తలు అరుణ, పద్మ పాల్గొన్నారు.

కాలిన ట్రాన్స్‌ఫార్మర్



కాలిపోయిన ట్రాన్స్

గిద్దలూరు రూరల్: మండలంలోని పాదలకుంటపల్లెలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉన్న సుమారు 10 ఎకరాల్లో ఉన్న కొర్ర, టమోట పంటల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిన ప్రతిసారి రూ.4 వేలు ఖర్చు పెట్టుకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మూడోసారి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో బోర్లలో నీరు పంటలకు అందించలేకపోతున్నారు. పంటలు కళ్లముందు ఎండిపోతుంటే చాలా బాధగా ఉందని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు ఇలా తరుచూ కాలిపోతుందో అర్థం కావడం లేదు. ఒక వైపు వర్షాలు పడకపోవడంతో నీరు లేని పరిస్థితి ఏర్పడింది. బోర్ల నుంచి నీటిని పంటలకు అందించి పంటలను రక్షించుకుందామంటే ఈ విధమైన కష్టాలు ఏర్పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి పంటలకు నీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏడీఈ శేష గిరిరావును వివరణ కోరగా సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 119 కేసుల పరిష్కారం

గిద్దలూరు రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరి సారాధానమ్మల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సివిల్ కేసులు 6, క్రిమినల్ కేసులు 90, చెక్‌బౌన్స్ కేసులు 6, మనోవర్తి, గృహహింస 5, బ్యాంకు పీఎల్‌సీ కేసు ఒకటి, డిక్రీ అమలు కేసు ఒకటి, బీఎస్ఎన్ కేసులు 10 మొత్తం 119 కేసులు పరిష్కరించారు. న్యాయవాదులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడండి

మార్కాపురం రూరల్: సనాతన ధర్మాన్ని కాపాడాలని ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాతీయ ప్రచార చీఫ్ ఆఫ్ చాంపియన్ శివసేవక్ శివశివకరుణ పాదయాత్ర శనివారం రాయవరం గ్రామానికి చేరుకుంది. ఈయనకు రాయవరం గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. శివశికరుణ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా రాయవరంలోని నిర్మమహేశ్వర వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మరక్షణ కోసం అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పాదయాత్ర చేస్తున్నానన్నారు. భారత దేశ రక్షణలో అమరులైన వీరుల గాథలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సనాతన ధర్మాన్ని పాటించాలి కోరారు. గాయం దశరథ రామిరెడ్డి, దేవండ్ల ఏడుకొండలు, వేముల క్రిష్టారావు, తమ్మిశెట్టి పుండరీ, వెంకట రామయ్య, ఏడుకొండలు, శ్రీను, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు

పొదిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులను హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కరీముల్లా బేగ్ ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త తీసివేయటం, చదును చేయటం పనులను కరీముల్లా బేగ్ యంత్రాలతో చేయించారు. అవసరమైన నిధులను తన సంస్థ నుంచే ఖర్చు చేస్తున్నట్లు కరీముల్లా బేగ్ చెప్పారు. బేగ్ చేపట్టిన పనులను న్యాయవాది షబ్బీర్‌తో పాటు, వాకింగ్ ట్రాక్ సభ్యులు, వాకర్లు అభినందించారు.

పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి

మార్కాపురం రూరల్: పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని రాయవరం జనరల్ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ఖలీమాభాను అన్నారు. శనివారం ఉదయం రాయవరంలో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్తులతో కలిసి నేను బడికి పోతా.. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీమాభాను మాట్లాడుతూ విద్యార్థులంతా పనులకు కాకుండా బడులకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. బడికి వచ్చినట్లయితే పిల్లల భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని ఆమె తెలిపారు. ఉపాధ్యాయులు వినుకొండ రాజేష్, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలను పరిశీలించిన ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఏరియా వైద్యశాలను స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాలలోని వసతుల గురించి అక్కడి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితులపై వైద్యులతో మాట్లాడారు. వైద్యశాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచి దప్పిల భాస్కర్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

వెలుగొండలో భక్తుల సందడి



వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ కాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



అంకరణలో ఆంజనేయస్వామి



కుంకుమ బండి

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు(దక్షిణం పల్లి) గ్రామంలో సీతాలక్ష్మణ హనుమత్ సహిత రామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవాలను నిర్వహించారు. శనివారం గంగానయనము, గోపూజ, గణపతి పూజా కార్యక్రమాలతో పాటు సీతారామచంద్ర మూర్తులకు శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామికి ఉత్సవం నిర్వహించి నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు చేశారు. సాయంత్రం పోలేరమ్మ తల్లికి కుంకుమ బండ్లు కట్టి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు గ్రామంలో నిర్వహించిన పండగ మహోత్సవాలకు బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

సీనియర్ అసిస్టెంట్ హనుమంతరావు పదవీ విరమణ

గిద్దలూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వి.హనుమంతరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని తహసీల్దార్ డి.సిద్ధార్థ్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమంతరావు విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా పనిచేసి ఉద్యోగులందరికీ ఆదర్శంగా పని చేశారని తహసీల్దార్ సిద్ధార్థ్ అన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు దంపతులను ఘనంగా సత్కరించారు. వారి సేవలను తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఎప్పటికీ మరచిపోలేరన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు అంజి, వీఆర్‌ఓలు, సిబ్బంది అల్లూరయ్య పాల్గొన్నారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి

మార్కాపురం రూరల్: వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జూలై 1వ తేదీ సక్రమంగా పంపిణీ చేయాలని మార్కాపురం ఎంపీడీఓ తోట చందన అన్నారు. శనివారం మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాయంతో ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయాలన్నారు. 11 కేటగిరీల ద్వారా పింఛను పంపిణీ దారులకు 4వేల రూపాయలు జూలై పింఛను తోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలవి 3 వేలు కలిపి మొత్తం 7 వేల రూపాయలను అందించాలని తెలిపారు. పింఛను పంపిణీలో ప్రతి ఒక్కరూ పారదర్శకంగా వ్యవహరించాలని, పింఛను పంపిణీలో అవకతవకలు జరిగినట్లయితే సహించేది లేదని హెచ్చరించారు.